

మాట్లాడుతున్న కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్

వైసీపీ ఓట్లకు కాంగ్రెస్ గండి!



- శ్రీకాకుళం పార్లమెంట్, టెక్కలి అసెంబ్లీ స్థానంలో అధికం
- అధికార పార్టీ అభ్యర్థులకు సొంత సామాజిక వర్గం నుంచే పోటీ
- త్రిముఖ పోరుతో టీడీపీకే లాభదాయకమంటున్న నిపుణులు

(ఆంధ్రజ్యోతి-శ్రీకాకుళం)

అధికార పార్టీకి శ్రీకాకుళం పార్లమెంట్ నియోజకవర్గం గెలుపుపై ఆశలు సన్నగిల్లుతున్నాయి. ఈసారి త్రిముఖ పోటీలో... లాభపడేది టీడీపీ అభ్యర్థి కింజరాపు రామ్మోహన్ నాయుడు కాగా.. నష్టపోయేది మాత్రం వైసీపీ అభ్యర్థి పేరాడ తిలక్ అని విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తంచేస్తున్నారు. వైసీపీ ఓట్లకు కాంగ్రెస్ గండి కొట్టిందని.. టీడీపీకి ఓటు బ్యాంకు మరింత పెరిగిందని స్పష్టం చేస్తున్నారు. ఇటు శ్రీకాకుళం పార్లమెంట్‌తో పాటు టెక్కలి అసెంబ్లీ స్థానాల్లో అధికారపార్టీ అభ్యర్థులపై సొంత సామాజికవర్గ నేతలే కాంగ్రెస్ నుంచి బరిలో దిగడంతో ఓట్ల చీలిక జరిగిందని పేర్కొంటున్నారు.

● కింజరాపు ఎర్రన్నాయుడు మరణానంతరం రాజకీయరంగ ప్రవేశం చేసిన ఆయన కుమారుడు రామ్మోహన్‌నాయుడు తొలిసారిగా 2014లో శ్రీకాకుళం ఎంపీ అభ్యర్థిగా పోటీచేసి భారీమెజార్టీతో గెలుపొందారు. పలు సమస్యలపైనా పార్లమెంట్‌లో తన హవా చూపించి... సిక్కోలు సత్తా చాటారు. 2019లో జగన్ ఒక్కచాన్స్ హవాలోనూ.. ఎంపీగా రామ్మోహన్‌నాయుడు గెలిచారు. అప్పట్లో టీడీపీకి టెక్కలి, ఇచ్ఛాపురం ఎమ్మెల్యే స్థానాలే దక్కగా.. రామ్మోహన్‌నాయుడు మాత్రం క్రాస్ ఓటింగ్‌తో మెజార్టీ పొందారు. ఈసారి హ్యాట్రిక్ సాధిస్తానన్న ధీమాతో రామ్మోహన్ ఉన్నారు. సోమవారం జరిగిన పోలింగ్ తీరు పరిశీలిస్తే.. అందుకు పరిస్థితులు కూడా అనుకూలంగానే ఉన్నాయి.

● వైసీపీ ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్.. గత ఎన్నికల్లో టెక్కలిలో అచ్చెన్నాయుడుపై ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు. అయినా జిల్లాలో బలమైన కళింగ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి కావడంతో ఈ సారి ఎంపీగా పోటీచేసేందుకు జగన్ అవకాశం కల్పించారు. కాగా.. ఇదే సామాజికవర్గానికి చెందిన కేంద్రమాజీ మంత్రి కిల్లి కృపారాణి.. వైసీపీలో తనకు తగిన గుర్తింపు లేదంటూ.. ఈ ఎన్నికల ముందు కాంగ్రెస్‌లో చేరారు. వైసీపీకి గట్టి షాక్ ఇచ్చారు. టెక్కలి కాంగ్రెస్ అభ్యర్థిగా ఆమె పోటీ చేశారు. వైసీపీలోని వైఎస్సార్ అభిమానులు.. చాలామంది కృపారాణికే ఓట్లు వేసినట్టు విశ్వసనీయ సమాచారం. ఈక్రమంలో అక్కడ వైసీపీలో ఓట్ల చీలిక జరిగినట్టే. ముందుగా వైసీపీ నుంచి కృపారాణికి ఎంపీ సీటు కేటాయిస్తే.. ఆమె పార్టీలోనే కొనసాగేది. టీడీపీ-వైసీపీ మధ్య టఫ్ ఫైట్ జరిగేది. అలాకాకుండా ఓటమిపాలైన తిలక్‌కు ఎంపీ అభ్యర్థిగా అవకాశం ఇవ్వడంతో వార్ వన్‌సైడ్ జరిగిందని.. టీడీపీ ఎంపీ అభ్యర్థి వైపు ఓటర్లు మొగ్గు చూపారని తెలుస్తోంది.

● ఇక కాంగ్రెస్ పార్టీ నుంచి పేడాడ పరమేశ్వరరావు ఎంపీ అభ్యర్థిగా పోటీచేశారు. ఈయన కూడా కళింగ సామాజిక వర్గమే. టెక్కలి నియోజకవర్గం నుంచే రావడంతో పరోక్షంగా.. ప్రత్యక్షంగాను ప్రభావితం చేయగలిగారని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. సొంత సామాజిక వర్గం నుంచి పరమేశ్వరరావుకు అండదండలు లభించాయి. గెలుపు సంగతి పక్కనపెడితే పరమేశ్వరరావు వెంట వైసీపీలో ఉన్నవారే కొంత మంది తిరిగారు. అటు పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల, ఇక్కడ కృపారాణిపై అభిమానం ఉన్నవారంతా కాంగ్రెస్‌కే ఓటేశారు. ఈ క్రమంలో వైసీపీ ఓట్లకు కాంగ్రెస్ గండికొట్టినట్టేనని.. పరోక్షంగా టీడీపీకి మరింత లాభదాయకంగా పరిస్థితి మారిందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

ఓట్ల లెక్కింపునకు పకడ్బందీ ఏర్పాట్లు

- ఎన్నికల నిర్వహణలో ప్రజల సహకారం మరువలేనిది
- జిల్లా ఎన్నికల అధికారి మన్‌జీర్ జిలానీ సమూన్

కలెక్టరేట్, మే 16: సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపునకు సంబంధించి పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో జేసీ నవీన్‌తో కలిసి.. ఆర్వోలు, నోడల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. అంకితభావం, సమన్వయంతో పనిచేయడం వలన జిల్లాలో సమష్టి కృషితో ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా ముగిసిందంటూ అధికారులను, సిబ్బం దిని అభినందించారు. ఎన్నికల నిర్వహణలో జిల్లా ప్రజల సహకారం మరువ లేనిదని పేర్కొన్నారు. జేసీ నవీన్‌ను ప్రత్యేకంగా అభినందిస్తూ.. ఆయన సేవల ను కొనియాడారు. అనంతరం ఓట్ల లెక్కింపునకు సంబంధించి పలు ఆదేశాలు జారీచేశారు. 'జూన్ 4న శివానీ కళాశాలలో ఓట్ల లెక్కింపు చేపట్టనున్నాం. స్ట్రాంగ్‌రూమ్‌ల వద్ద మూడంచెల భద్రత.. పటిష్ఠ నిఘా ఏర్పాటు చేశాం. కౌంటింగ్‌కు సంబంధించి సిబ్బంది ఎంపిక, శిక్షణ పూర్తిచేయాల్సి ఉంది. కౌంటింగ్ కేంద్రాల్లో టేబుళ్ల ప్లాన్ పక్కాగా నిర్వహించాలి. ఎన్నికల కమిషన్ సూచన మేరకు ప్రతీ టేబుల్‌లో మైక్రో అబ్జర్వర్, కౌంటింగ్ సూపర్‌వైజర్, ఇద్దరు అసిస్టెంట్లు ఉండాలి. సిబ్బందికి, ఏజెంట్లకు ఇబ్బందులు లేకుండా మౌలిక వసతులు కల్పించాలి' అని కలెక్టర్ ఆదేశించారు.

ఇదిలా ఉండగా.. ఎన్నికల నిర్వహణపై అధికారులు మాట్లాడుతూ.. చిన్న విషయమైనా కలెక్టర్ స్పందించిన తీరు క్షేత్రస్థాయిలో తమకు ఎంతగానో ఉపయోగపడిందని తెలిపారు. కష్టానికి తగిన ప్రతిఫలం దక్కిందని సంతోషం వ్యక్తం చేశారు. సమావేశంలో డీఆర్వో ఎం.గణపతిరావు, ఆర్వోలు నూరుల్‌కమర్, భరత్‌నాయక్, సీహెచ్.రంగయ్య, లక్ష్మణమూర్తి, రామ్మోహన్, సుదర్శనదొర, అప్పారావు, జడ్పీ సీఈవో వేంకటేశ్వరరావు, సీపీవో ప్రసన్నలక్ష్మి, లీడ్ బ్యాంకు మేనేజర్ సూర్యకిరణ్, జిల్లా సమాచార పౌరసంబంధాల అధికారి కె.చెన్న కేశవరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

మా నాయకుడే గెలుస్తాడని..



- ఎన్నికల ఫలితాలపై జోరుగా పందాలు
- మెజార్టీపై టీడీపీ.. గెలుపుపై వైసీపీ బెట్టింగ్‌లు

(టెక్కలి)

ఎన్నికల ఫలితాలపై జోరుగా పందాలు సాగుతున్నాయి. మా నాయకుడు గెలుస్తాడని కూటమి శ్రేణులు.. లేదు మళ్లీ మాదే అధికారమని.. మా నాయకుడే గెలుస్తాడని వైసీపీ నేతలు, కార్యకర్తలు బెట్టింగ్‌లు కాస్తున్నారు. ఈ సారి తమ విజయం ఖాయమని.. మెజార్టీపై టీడీపీ అభిమానులు.. గెలుపుపై వైసీపీ శ్రేణులు పందాలు వేస్తున్నారు. ఓట్ల లెక్కింపు కోసం వారంతా ఎదురుచూస్తున్నారు. తీర్పు ఎవరికి అనుకూలంగా వస్తుందనేది చర్చనీయాంశ మవుతోంది. జిల్లాలో రికార్డుస్థాయిలో ఈ సారి 76.81 శాతం పోలింగ్ నమోదైంది. ఓటింగ్ శాతం పెరగడంతో.. ఈసారి అధికారపార్టీకి వ్యతిరేకంగా ఓట్లు పడినట్టు.. వైసీపీ నాయకులు కంగారు పడుతున్నారు. మరోవైపు మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తూ.. కొంతమంది పందాలు కాస్తున్నారు. అభ్యర్థులగెలుపుతో పాటు రాష్ట్రంలో ఎవరు ప్రభుత్వ ఏర్పాటు చేస్తారన్న దానిపై కూడా పందాలు జోరందుకున్నాయి. రాష్ట్ర స్థాయిలో ఏ పార్టీకి ఎన్ని సీట్లు వస్తాయి? నియోజకవర్గంలో ఏ పార్టీకి ఎన్ని ఓట్లు వస్తాయి? అన్న దానిపైనే బెట్టింగ్‌లు సాగుతున్నాయి. జిల్లాలో ప్రధానంగా టెక్కలి నియోజకవర్గంలో రూ.లక్షల్లో పందాలు వేస్తున్నారు. టెక్కలిలో టీడీపీ అభ్యర్థిగా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు పోటీ చేశారు. గత ఎన్నికల్లో.. వైసీపీ ఒక్కఛాన్స్ హవాలోలనూ.. అచ్చెన్నాయుడు విజయం సాధించారు. ఈ సారి కూడా విజయం ఖాయమని ధీమాతో ఉన్నారు. ఇప్పటివరకూ వైసీపీ ఇక్కడ బోణీ కొట్టలేదు. ఈ నేపథ్యంలో ఈసారి ఈ నియోజకవర్గంలో ఎలాగైనా పాగా వేయాలని.. వైసీపీ అధినేత జగన్‌సైతం ప్రత్యేక దృష్టి సారించారు. అచ్చెన్నపై ప్రత్యర్థిగా ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనును బరిలో దించారు. పోలింగ్ ముగియడంతో గెలుపెవరిది అనే చర్చ సాగుతోంది. ఈ క్రమంలో పందాలు ఊపందుకుంటున్నాయి. మంగళ, బుధవారాల్లో కోటబొమ్మాళి మండలం నిమ్మాడలో అచ్చెన్నను పెద్ద సంఖ్యలో పార్టీ కార్యకర్తలు, అభిమానులు కలిశారు. తమ విజయానికి ఢోకా లేదని, 20వేలకుపైగా మెజార్టీ వస్తుందని అచ్చెన్న వారికి స్పష్టం చేశారు. ఇక వైసీపీ శ్రేణులు గురువారం కోటబొమ్మాళిలోని ఓ ప్రైవేటు కళాశాలలో సమావేశమయ్యారు. వెయ్యి ఓట్లుతోనైనా ఈసారి టెక్కలిలో వైసీపీ గెలుస్తుందని చెప్పుకొస్తున్నారు. అచ్చెన్నకు ఓటు వేసేందుకు విదేశాల నుంచి వచ్చినవారు, పలువురు సీమెన్‌లు, సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, కొందరు వ్యాపారులు, టీడీపీ కార్యకర్తలు.. అచ్చెన్న 20వేలకుపైగా మెజార్టీ వస్తుందంటూ.. వైసీపీ శ్రేణులతో రూ.వేలు.. రూ.లక్షల్లో బెట్టింగ్ కాస్తున్నారు. స్వల్ప మెజార్టీతోనైనా వైసీపీ గెలుస్తుందని ఆ పార్టీ శ్రేణులు, అభిమానులు పందెంకు సై అంటున్నారు. పేర్లు బయటకు పొక్కకుండా ఉండేందుకు చాలామంది వాట్సాప్ కాల్స్‌లో మాట్లాడుకుంటున్నారు. మధ్యవర్తులకు రెండు పార్టీల వారు సొమ్ము చెల్లిస్తున్నారు. వీరితో పాటు ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన రెడ్డీలు కొందరు టెక్కలిలో వైసీపీ గెలుస్తుందని బెట్టింగ్ కాసినట్లు తెలుస్తుంది. వైశ్య వర్గానికి చెందిన పలువురు ముఖ్య నాయకులు టీడీపీ మెజార్టీ కోసం బెట్టింగ్‌ల్లో ముందువరుసలో ఉన్నట్లు తెలుస్తోంది. ఏదిఏమైనా ఫలితాలు వచ్చేవరకూ వేచిచూడాల్సిందే.

రెండు రోజులూ అవస్థలే

- ఈవీఎంల మొరాయింపుతో అర్ధరాత్రి వరకూ పోలింగ్
- ముందురోజు ఎన్నికల సామగ్రి పంపిణీలోనూ ఇబ్బందులు
- వేకువజామున స్ట్రాంగ్‌రూమ్‌కు ఈవీఎంల తరలింపు

పలాస/ ఆమదాలవలస, మే 16: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా సోమవారం అర్ధరాత్రి వరకూ పోలింగ్ సాగింది. కొన్నిచోట్ల ఈవీఎంలు మొరాయించడంతో.. పోలింగ్ ప్రక్రియ జాప్యమైంది. ఇటు ఓటర్లకు.. అటు పోలింగ్ అధికారులకు నిరీక్షణ ఎదురైంది. పోలింగ్ ముగిశాక అన్ని రికార్డులు సరిచేసుకుని ఈవీఎంలతో స్ట్రాంగ్‌రూమ్‌కు వెళ్లేసరికి.. చాలా ఆలస్యమైంది. పోలింగ్ మెటీరియల్ అప్పగించేందుకు సోమవారం అర్ధరాత్రి నుంచి మంగళవారం ఉదయం వరకు వేచి ఉన్నారు. పోలింగ్ ముందురోజు ఎన్నికల సామగ్రి పంపిణీ సమయంలోనూ అవస్థలు పడ్డారు. సాధారణంగా ఉదయం 7గంటల నుంచి సాయంత్రం 6 గంటలలోపు పోలింగ్ పూర్తవ్వాలి. నిర్దేశిత సమయానికి క్యూలో ఉన్నవారికి ఓటు వేసేందుకు అవకాశం కల్పించాలి. కాగా.. పలాస నియోజకవర్గంలోని 40 కేంద్రాల్లో రాత్రి 9 గంటల వరకూ పోలింగ్ కొనసాగింది. యూపీ, ఉన్నత పాఠశాలల్లో సాయంత్రం 6 గంటల సమయానికి ఓటర్లు బారులుదీరారు. వారంతా ఓటేసి..ప్రక్రియ పూర్తయేసరికి రాత్రి 9 గంటలైంది. అనంతరం ఈవీఎంలను బస్సుల్లో ఎక్కించి.. ఎచ్చెర్ల మండలం చిలకపాలెంలోని శివానీ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్‌రూమ్‌లను తరలించేసరికి రాత్రి రెండు.. మూడు గంటలైందని సిబ్బంది తెలిపారు.



పలాసలో టెంట్లు కూలిపోవడంతో.. నిరీక్షిస్తున్న ఎన్నికల సిబ్బంది (ఫైల్)

● పోలింగ్ ముందురోజు పలాసలో ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రం వద్ద అలజడి రేగింది. ఉదయం 7గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల లోపు ఎన్నికల సామగ్రి పంపిణీ చేయాలి. కాగా.. ఆదివారం వేకువజామున భారీ వర్షంతోపాటు ఈదురు గాలులు వీయడంతో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన టెంట్లు మొత్తం కుప్పకూలిపోయాయి. కుర్చీలు చెల్లాచెదురయ్యాయి. దీంతో ఎన్నికల సామగ్రి పంపిణీకి తీవ్ర అవరోధం ఏర్పడింది. అధికారులు ప్రత్యామ్నాయంగా ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని వరండాలో సామగ్రి పంపిణీ చేశారు. సాయంత్రం 6 గంటలైనా పోలింగ్ కేంద్రాలకు బస్సుల్లో సామగ్రి తరలించలేకపోయారు. గంటలపాటు నిరీక్షించలేక.. సిబ్బంది అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎన్నికల విధులు కష్టమే కానీ.. ఛాలెంజ్‌గా తీసుకుని పనిచేశామని.. శ్రీకాకుళం నగరానికి చెందిన మహేశ్వరి అనే ఉద్యోగి తెలిపారు.



యరగాం పోలింగ్ కేంద్రంలో సోమవారం రాత్రి ఒంటి గంటకు బయటకు వచ్చిన సిబ్బంది

● సరుబుజ్జిలి మండలం యరగాం గ్రామంలో అర్ధరాత్రి 12.30 గంటల వరకు పోలింగ్ నిర్వహించారు. బుధవారం వేకువజామున 4 గంటలకు భారీ పోలీస్ బందోబస్తు నడుమ స్ట్రాంగ్‌రూమ్‌కు ఈవీఎంలు తరలించారు. అనంతరం సొంత స్థలాలకు చేరుకోవడానికి రవాణా సౌకర్యం లేక సిబ్బంది ఇబ్బందులు పడ్డారు. ఇదిలా ఉండగా.. రాష్ట్రంలో కొన్ని జిల్లాల్లో పోలింగ్ అధికారులకు రూ.వెయ్యి, రూ.750 పారితోషికం ఇవ్వగా.. జిల్లాలో మాత్రం రూ.500 మాత్రమే ఇచ్చారని పలువురు ఉద్యోగులు అసహనం వ్యక్తం చేశారు.

ఎన్నికలు ముగిశాయని నిర్లక్ష్యం వద్దు

- విశాఖ రేంజ్ డీఐజీ విశాల్ గున్నీ



సమావేశంలో మాట్లాడుతున్న డీఐజీ విశాల్ గున్నీ

విజయనగరం క్రైం, మే 16: ఎన్నికలు ముగిశాయని నిర్లక్ష్యం వద్దని, కౌంటింగ్ పూర్తయ్యే వరకూ అప్రమత్తంగా ఉండాలని విశాఖ రేంజ్ డీ ఐజీ విశాల్ గున్నీ అధికారులను ఆదేశించారు. గురువారం విజయనగరం జిల్లా పోలీసు కార్యాలయంలోని సమావేశ మందిరంలో రేంజ్ పరిధిలోని విజయనగరం, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల ఎస్పీలు, పోలీసు అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కౌంటింగ్ పూర్తయే వరకూ సమస్యాత్మక గ్రామాల్లో పికెటింగ్‌లు ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు. ఈవీఎంలు భద్రపరిచిన కేంద్రాలు వద్ద పటిష్ఠ భద్రతను ఏర్పాటు చేసి పర్యవేక్షించాలన్నారు. గ్రామాల్లో చురుగ్గా ఉన్న వ్యక్తులను, రాజకీయంగా వివాదాలు సృష్టించే వ్యక్తులను గుర్తించి పోలీసు స్టేషన్‌కు పిలిపించి కౌన్సిలింగ్ ఇవ్వాలన్నారు. సమావేశంలో విజయనగరం ఎస్పీ దీపిక, పార్వతీపురం-మన్యం ఎస్పీ విక్రాంత్ పాటిల్, శ్రీకాకుళం ఎస్పీ జీఆర్ రాధిక, అనకాపల్లి ఎస్పీ మురళీకృష్ణ, అల్లూరి సీతారామరాజు ఎస్పీ తుహీం సిన్హా, అదనపు ఎస్పీలు ఆస్మా పరహీన్, ప్రేమ్‌కాజల్, దిలీప్ కిరణ్, సునీల్ షరోన్, ట్రైనీ ఐపీఎస్ జావలి, డీఎస్పీలు శ్రీనివాసరావు, గోవిందరావు, చక్రవర్తి, మురళీధర్, జీవీ కృష్ణారావు, అప్పలరాజు, అప్పారావు, కేవీ సత్యనారాయణ, బాలచంద్రారెడ్డి, సునీతా, నాగేశ్వరరెడ్డి తోపాటు ట్రైనీ డీఎస్పీలు మహీంద్ర, సీహెచ్ రాజా, సీఐలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ప్రజా భాగస్వామ్యంతోనే డెంగ్యూ నివారణ

- డీఎంహెచ్‌వో బొడ్డేపల్లి మీనాక్షి

అరసవల్లి, మే 16: ప్రజా భాగస్వామ్యంతోనే శాతశాతం డెంగ్యూ నివారణ సాధ్యమని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారిణి బొడ్డేపల్లి మీనాక్షి అన్నారు. జాతీయ డెంగ్యూ నివారణ దినోత్సవం సందర్భంగా స్థానిక డీఎంహెచ్‌వో కార్యాలయ ప్రాంగణంలో శుక్రవారం ఆమె ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. డెంగ్యూ వ్యాధివ్యాప్తికి కారణాలు, నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులు దోమల ద్వారా వ్యాపిస్తాయని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం, వృథా నీటి నిర్మూలన ద్వారా దోమలను నివారించవచ్చని తెలిపారు. ఈ వ్యాధి లక్షణాలు కనిపిస్తే తక్షణమే రక్త, ఎలీసా వంటి పరీక్షలు చేయించుకోవాలన్నారు. వ్యాధి నిర్ధారణ అయితే వెంటనే వైద్యుని సంప్రదిస్తే ప్రాణాపాయం నుంచి బయటపడవచ్చునన్నారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి పీవీ సత్యనారాయణ, అర్బన్ వైద్యాధికారి లింగరాజు, జిల్లా మాస్ మీడియా అధికారి పైడి వెంకటరమణ, మలేరియా కన్సల్టెంట్ శ్రీకాంత్, ఎంఆర్‌కే దాస్, లక్ష్మి, శ్రీనివాస్, నరసింహం, మురళి, సాయి, ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.



ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో మీనాక్షి



ఎచ్చెర్ల : శ్రీ వెంకటేశ్వర కళాశాలలో విద్యార్థుల హాల్‌టిక్కెట్ల పరిశీలన

ప్రశాంతంగా ఏపీ ఈఏపీ సెట్

ఎచ్చెర్ల/ నరసన్నపేట, మే 16: రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో ఇంజనీరింగ్, అగ్రికల్చర్, సెరికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రథమ సంవత్సరంలో అడ్మిషన్లకు ఏపీ ఈఏపీ సెట్ గురువారం ప్రశాంతంగా ప్రారంభమైంది. జిల్లాలోని శ్రీశివానీ ఇంజనీరింగ్ కళాశాల(చిలకపాలెం), శ్రీ వెంకటేశ్వర ఇంజనీరింగ్ కళాశాల(ఎచ్చెర్ల), ఐతం (టెక్కలి), కోర్ టెక్నాలజీస్ (నరసన్నపేట) కేంద్రాల్లో ఈ పరీక్షలు నిర్వహిస్తున్నారు. జేఎన్‌టీయూ (కాకినాడ) పర్యవేక్షణలో ఈ నెల 23వరకు ఉదయం 9 నుంచి 12గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30గంటల వరకు ప్రతిరోజు రెండు షిఫ్ట్‌ల్లో ఆన్‌లైన్ విధానంలో పరీక్షలు జరుగుతాయి. శివానీ కళాశాలలో రెండు షిఫ్ట్‌ల్లో పరీక్షలకు 412మంది విద్యార్థులకు 375 మంది హాజరయ్యారు. 37మంది గైర్హాజరయ్యారు. వెంకటేశ్వర కళాశాలలో 346 మంది విద్యార్థులకుగానూ 339 మంది హాజరుకాగా, ఏడుగురు గైర్హాజరయ్యారు. నరసన్నపేటలోని కోర్ టెక్నాలజీ కేంద్రంలో 660 మంది విద్యార్థులు హాజరయ్యారు. 49మంది గైర్హాజరయ్యారు.



నరసన్నపేట: పరీక్షా కేంద్రం వద్ద విద్యార్థులు



ఔట్‌లెట్ కాలువ వద్ద నిండిన గుర్రపుడెక్క

రూపుకోల్పోతున్న మినీ రిజర్వాయర్

- గుర్రపు డెక్కతో సాగునీటికి ఇబ్బందులు
- పట్టించుకోని వంశధార అధికారులు

(సరుబుజ్జిలి)

వంశధార కుడి ప్రధాన కాలువ అనుసంధానంతో సరుబుజ్జిలి మండలం కొత్తకోటలో ఏర్పాటు చేసిన మినీ జలాశయాన్ని గుర్రపు డెక్క కప్పేసింది. తమకు సాగునీటి ఇబ్బందులు ఎదురవుతున్నా.. వంశధార అధికారులు పట్టించుకోవడం లేదని ఆయకట్టు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గొట్టాబ్యారేజ్ నుంచి ఈ కుడి ప్రధాన కాలువ ద్వారా హిరమండలం, ఎల్.ఎన్.పేట, సరుబుజ్జిలి, ఆమదాలవలస, శ్రీకాకుళం, గార మండలాల్లోని వేలాది ఎకరాలకు సాగునీరు అందుతుంది. ఈ కాలువ ద్వారా వచ్చే నీటి ప్రవాహాన్ని కొత్తకోట పెద్ద చెరువును మినీ జలాశయంగా మార్పు చేశారు. ఈ జలాశయం కింద కొత్తకోట, షలంత్రి, చిన్న షలంత్రి, వెంకటాపురం, నక్కలపేట, రావివలస, పాలవలస, అవతరాబాద్, డకరవలస, తమ్మినాయుడుపేట, సుభద్రాపురం గ్రామాలకు చెందిన సుమారు రెండు వేల ఎకరాలకు సాగునీరు అందించాల్సి ఉంది. కొంతకాలం నుంచి ప్రధాన కాలువతో పాటు మినీ జలాశయంలో పూర్తిస్థాయిలో గుర్రపుడెక్క పేరుకుపోయి నీటి ప్రవాహం నిలిచిపోయింది. కాలువల ద్వారా గుర్రపు డెక్క పంట పొలాలకు చేరి రైతులకు తీవ్ర నష్టం వాటిల్లుతోంది. వేసవిలో గుర్రపు డెక్క తొలగింపు చర్యలు చేపడతామన్న వంశధార అధికారులు... నేటికీ పనులు చేపట్టలేదు. మినీ జలాశయం ఇన్‌లెట్, అవుట్‌లెట్ కాలువలో వద్ద ఏర్పాటు చేసిన షట్టర్లు కూడా తుప్పుపట్టి కొట్టుకుపోయే పరిస్థితి ఏర్పడింది. టీడీపీ హయాంలో కొత్తకోట జలాశయంలో ఉపాధి పథకం ద్వారా పూడికతీత పనులు చేపట్టారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో కనీస అభివృద్ధి పనులు కూడా చేయకపోవడంతో ప్రస్తుతం నీరు కనిపించకుండా మొత్తంగా గుర్రపుడెక్క పేరుకుపోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కలెక్టర్, వంశధార అధికారులు స్పందించి వంశధార కుడి ప్రధాన కాలువతోపాటు కొత్తకోట మినీ జలాశయంలో గుర్రపు డెక్క తొలగించాలని రైతులు కోరుతున్నారు.



తుప్పుపట్టిన జలాశయ ఇన్‌లెట్ షట్టర్లు

సైన్స్ విద్యార్థుల కోసం

టెన్త్, ఇంటర్ తరవాత What Next

(నిన్నటి పేజీ తరువాయి)



ఫిషరీస్

సైన్స్, ఆర్ట్స్, బిజినెస్‌ను ఒక్కచోట చేరిస్తే అది ఫిషరీస్‌గా చెప్పవచ్చు. ప్రపంచంలో మత్స్య సంపదను ఎక్కువగా ఉత్పత్తి చేస్తున్న మూడో అతిపెద్ద దేశం భారత్. మన దేశానికి 7500 కిలోమీటర్ల విశాలమైన సముద్ర తీరం ఉంది. దీనితోపాటు దేశంలో కూడా అపారమైన నీటి వనరులు ఉన్నాయి. వీటన్నింటి కారణంగా ఈ రంగంలో అవకాశాలు విస్తారంగా కనిపిస్తాయి. ఫిషరీస్ రంగంలో ఉద్యోగాల విషయానికి వస్తే ఫామ్ మేనేజర్లు, హేచరీ మేనేజ్‌మెంట్, పోస్ట్ హార్వెస్ట్ మేనేజ్‌మెంట్ - ప్రాసెసింగ్, ఫిషరీ ఇన్‌స్పెక్టర్, ఫిషరీ వర్కర్ తదితరాలు ప్రధానంగా ఉంటాయి. ఫిషరీ రంగంలోని టెక్నికల్ ఫీల్డ్‌లోకి వెళ్లాలనుకునేవారు బైపీసీతో ఇంటర్ పూర్తిచేసి ఉండాలి. తెలుగు రాష్ట్రాల్లో ఏపీకి సంబంధించి ప్రత్యేకంగా ఆంధ్రప్రదేశ్ ఫిషరీస్ యూనివర్సిటీ ఉంది. నెల్లూరు జిల్లా ముత్తుకూరులో ఉన్న ఫిషరీష్ కాలేజీకి ఎంతో చరిత్ర ఉంది.

తెలంగాణలోని పీవీనరసింహారావు తెలంగాణ వెటర్నరీ యూనివర్సిటీ పరిధిలో కూడా ఒక కాలేజీ ఉంది.

డెయిరీ టెక్నాలజీ

భారత దేశంలో ఎక్కువ మందికి ఉపాధి కల్పిస్తున్న రంగాల్లో డెయిరీ ఒకటి. ప్రపంచ పశు సంపదలో భారత్ వాటా ఎక్కువే. మన దేశానికి విదేశీ మారక ద్రవ్యాన్ని ఆర్జించిపెడుతున్న రంగాల్లో డెయిరీ కూడా ఒకటి. అయితే ఈ రంగం ఇప్పటికీ సంప్రదాయ వ్యక్తుల చేతుల్లోనే ఉంది. చైనా, మెక్సికో లాంటి అభివృద్ధి చెందుతున్న దేశాలు కూడా ఇందులో దూసుకుపోతుంటే మనం మాత్రం కొంత వెనకబడి ఉన్నామని చెప్పుకోక తప్పదు. మన దేశంలోని కొన్ని సంస్థలు డెయిరీ టెక్నాలజీలో కోర్సులను అందిస్తున్నాయి. చాలావాటిలో చేరడానికి ఇంటర్ పూర్తి చేసినవారు అర్హులు. తెలుగు రాష్ట్రాలకు సంబంధించి ఏపీ- తిరుపతిలోని శ్రీవేంకటేశ్వర వెటర్నరీ యూనివర్సిటీ, తెలంగాణ - హైదరాబాద్ (రాజేంద్రనగర్)లోని పీవీ నరసింహారావు తెలంగాణ స్టేట్ వెటర్నరీ యూనివర్సిటీ డైరీ టెక్నాలజీలో కోర్సులను ఆఫర్ చేస్తున్నాయి.

హెల్త్‌కేర్ ఇండస్ట్రీ



ఇంటర్ బైపీసీతో పూర్తి చేసినవారు ఎంబీబీఎస్ కోర్సులో చేరవచ్చు. సుప్రీంకోర్టు ఉత్తర్వులు, కేంద్రప్రభుత్వ ఆదేశాల మేరకు మెడిసిన్, డెంటల్ కోర్సుల్లో చేరాలంటే 'నీట్' ర్యాంకు తప్పనిసరి. నాలుగున్నర సంవత్సరాల ఎంబీబీఎస్ కోర్సు మూడు ఫేజులు, తొమ్మిది సెమిస్టర్లుగా ఉంటుంది. సాధారణంగా ఒక్కో సెమిస్టరుకు 120 వర్కింగ్ డేస్ గ్యాప్ ఉంటుంది. ఎంబీబీఎస్ పూర్తిచేసిన ప్రతీ విద్యార్థి 12 నెలల ఇంటర్న్‌షిప్‌నకు వెళ్లాల్సి ఉంటుంది. ప్రధానంగా ఈ కింది రకాల మెడిసిన్ శాఖలు ఉంటాయి.

- మెడిసిన్(అల్లోపతి) అండ్ డెంటిస్ట్రీ,
- హోమియోపతి
- ఆయుర్వేద
- యునాని
- నేచురోపతి

ఈ కోర్సులను అందించే సంస్థల వివరాలు వెబ్‌పేజీలో...

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.
లేదా ఈ కింది యూఆర్ఎల్
https://ejyothy.com/KN1r9lc లో
చదవండి.

- ఆంధ్రజ్యోతి ఎడ్యుకేషన్ డెస్క్

(ఎంపిక చేసిన కొన్ని కాలేజీల లిస్టును మాత్రమే ఇక్కడ ప్రచురించాం. పూర్తి వివరాల కోసం గూగుల్ సెర్చ్ చేయగలరు.)

దిక్సూచి DIKSUCHI

ఫార్మసిస్టులు

టెన్త్, ఇంటర్ అర్హతలతో ఫార్మసీలో డిప్లొమా, డిగ్రీ, పీజీ కోర్సులు చేయవచ్చు. భారతదేశంలో ఫార్మసీ ఇండస్ట్రీ వంద సంవత్సరాల పురాతనమైనది. దేశవ్యాప్తంగా 25,000కు మించి మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్లు ఉన్నాయి. వీటిలో ఐదోవంతు బల్క్ డ్రగ్ యూనిట్లే. ఎంపిసి లేదా బైపీసీతో ఇంటర్ పూర్తిచేసినవారు నాలుగు సంవత్సరాల బ్యాచిలర్ ఆఫ్ ఫార్మసీ(బిఫార్మసీ) కోర్సులో చేరడానికి అర్హులు. స్వయం ఉపాధి కోసం మెడికల్ షాపుల నిర్వహణ లేదా ఆస్పత్రుల్లో ఫార్మసిస్టుల ఉద్యోగాల అర్హతల కోసం రెండు సంవత్సరాల డిప్లొమా ఇన్ ఫార్మసీ కోర్సు చేయొచ్చు. బిఫార్మసీ చేసినవారు మాస్టర్స్ ఇన్ ఫార్మసీ కోర్సు చేయొచ్చు.

అగ్రికల్చర్, సంబంధిత రంగాలు

వ్యవసాయానికి సంబంధించిన డిగ్రీ కోర్సుల్లో చేరాలంటే కనీసం 50 శాతం మార్కులతో బైపీసీ పూర్తిచేయాలి. అగ్రికల్చర్ అలాగే సంబంధిత ఇతర కోర్సులను తెలుగు రాష్ట్రాల్లోని సంబంధిత యూనివర్సిటీలు అందిస్తున్నాయి.

- అగ్రికల్చర్, హార్టికల్చర్
- ఎన్విరాన్‌మెంట్ - పౌల్ట్రీ ఫార్మింగ్
- ఫారెస్ట్రీ అండ్ వైల్డ్ లైఫ్
- రూరల్ అండ్ మేనేజ్‌మెంట్
- వెటర్నరీ సైన్స్

ఫ్లోరీ కల్చర్

కమర్షియల్‌గా పూల సాగు చేయడమే ఫ్లోరికల్చర్. తెగులును తట్టుకునే లా, ఎక్కువ పూలు పూసేలా మొక్కలను తయారు చేయడమే ఫ్లోరికల్చరిస్టుల పని. హార్టికల్చర్‌లో భాగంగా ఉన్న ఇది తరవాతి కాలంలో ప్రత్యేక విభాగంగా మారింది. బీఎస్సీ హార్టికల్చర్/అగ్రికల్చర్‌ను మన దేశంలో చాలా సంస్థలు అందిస్తున్నాయి. ఎంసెట్‌లో మెరిట్ ద్వారా మన రెండు రాష్ట్రాల్లో ఉమ్మడిగా ప్రవేశం పొందవచ్చు.

నవ్య | చిత్రజ్యోతి

థియేటర్ల బంద్ నిజం కాదు



రెండు తెలుగు రాష్ట్రాల్లో సింగిల్ స్క్రీన్ థియేటర్లను మూసివేస్తున్నారంటూ వస్తున్న వార్తల్లో నిజం లేదని తెలుగు చలనచిత్ర పరిశ్రమలోని అపెక్స్ బాడీలు తెలుగు ఫిల్మ్ ఛాంబర్, తెలంగాణ ఫిల్మ్ ఛాంబర్, తెలుగు చలనచిత్ర నిర్మాతల మండలి, తెలంగాణ స్టేట్ ఫిల్మ్ ఛాంబర్ గురువారం స్పష్టం చేశాయి. ఈ మేరకు ఆ సంస్థలు సంయుక్త ప్రకటన విడుదల చేశాయి. థియేటర్లను మూసి వేస్తున్నట్లు ఒక సంఘం నిర్ణయం తీసుకుందంటూ వస్తున్న వార్తలను ఆ సంస్థలు ఖండించాయి. 'ఇప్పటివరకూ థియేటర్ల యజమానులు కానీ, వారికి సంబంధించిన సంఘాలు గానీ మాకు ఎలాంటి నోటీసులు ఇవ్వలేదు. ఇదంతా అబద్ధపు ప్రచారం మాత్రమే' అని స్పష్టం చేశాయి. 'కొన్నాళ్లుగా వసూళ్లు తక్కువ రావడం వల్ల కొంతమంది థియేటర్ల యజమానులు వ్యక్తిగతంగా నిర్ణయం తీసుకుని ఉండవచ్చు, అపెక్స్ బాడీలకు దీంతో సంబంధం లేదు' అని పేర్కొన్నాయి. సింగిల్ స్క్రీన్ థియేటర్లను మూసివెయ్యాలనే నిర్ణయం తీసుకునే ముందు ఎగ్జిబిటర్లు తమను సంప్రదించలేదని ఫిల్మ్ ఛాంబర్ తెలిపింది.



కేన్స్‌కు ఐశ్వర్య కళ

ప్రతిష్ఠాత్మక 77వ కేన్స్ చలనచిత్రోత్సవాల్లో బాలీవుడ్ నటి, మాజీ ప్రపంచసుందరి ఐశ్వర్యారాయ్ బచ్చన్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. గురువారం ఆమె రెడ్‌కార్పెట్‌పై నడిచారు. బ్లాక్ అండ్ వైట్ దుస్తుల్లో చిరునవ్వులు చిందిస్తూ వేడుకకు ప్రత్యేక కళ తెచ్చారు. ఫ్రాన్స్‌లో జరుగుతోన్న ఈ వేడుకల్లో ఐశ్వర్యతో పాటు కియారా అద్వాణీ, శోభితా ధూళిపాళ, అదితీరావ్ హైదరీ పాల్గొన్నారు.

చేతికి కట్టుతో...



ఐశ్వర్యారాయ్ బచ్చన్ కేన్స్ చలనచిత్రోత్సవంలో మరోసారి మెరవబోతున్నారు. గురువారం కూతురు ఆరాధ్యతో కలసి ఈ వేడుకల్లో పాల్గొనేందుకు బయల్దేరివెళ్లారు. తల్లీ కూతుళ్లు ఇద్దరూ గురువారం ముంబై ఎయిర్‌పోర్ట్‌లో కనిపించారు. చేతికి గాయం అయినప్పుడు ధరించే కట్టుతో ఐశ్వర్య కనిపించారు. దీంతో రెడ్‌కార్పెట్‌పై ఆమె ప్రదర్శనపై అభిమానుల్లో ఆసక్తి నెలకొంది.

'చిత్రజ్యోతి'లో మరిన్ని ఆసక్తికర కథనాల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.
లేదా ఈ కింది యూఆర్ఎల్
https://ejyothy.com/HPclzIT
లో చదవండి.

పెద్ద హిట్ అవుతుంది

'ఈ సినిమాకు అరుణ్, నాగ బలం. నేను ఇంతవరకూ దర్శకుల్ని పరిచయం చేశాను. తొలిసారిగా నాగను నిర్మాతగా ఇంట్రడ్యూస్ చేస్తున్నాను. ట్రైలర్ చూస్తే టీమ్ పడిన కష్టం తెలుస్తుంది. ఇది న్యూ ఏజ్ లవ్ స్టోరీ అవుతుంది. ఈ నెల 25న వస్తున్న మా సినిమా పెద్ద హిట్ అవుతుందని ఆశిస్తున్నా' అన్నారు దిల్ రాజు. ఆశిష్, వైష్ణవి చైతన్య జంటగా నటించిన హారర్ థ్రిల్లర్ 'లవ్ మీ' ట్రైలర్‌ను గురువారం విడుదల చేసిన అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. శిరీష్ సమర్పణలో హర్షిత్ రెడ్డి, హన్షిత, నాగ మల్లిడి ఈ సినిమాను నిర్మించారు.



దర్శకుడు అరుణ్ భీమవరపు మాట్లాడుతూ 'యుద్ధం చేయడం కంటే ప్రేమించడానికి గట్స్ కావాలి. మనిషి ప్రేమను పొందడమే కష్టం అనుకుంటే దెయ్యాన్ని ప్రేమించడం ఇంకెంత కష్టమో ఆలోచించండి. ఆశిష్ ఈ పాత్రను అద్భుతంగా పోషించాడు. గంగాదేవిలాంటి పాత్రను వైష్ణవి చేశారు. ఈ ప్రపంచాన్ని ప్రేమే నడిపిస్తోంది. 'వై' అనే క్వశ్చన్ లేకుండా 'వావ్' అనుకుని ఈ సినిమాను చూసి ఎంజాయ్ చేయండి' అన్నారు.

'ఇంత మంచి సినిమా చేసే అవకాశం కల్పించిన దర్శకనిర్మాతలకు కృతజ్ఞతలు. మా సినిమాతో మళ్లీ థియేటర్లు కళకళలాడతాయి' అన్నారు ఆశిష్. ఈ చిత్రంలో డిఫరెంట్‌గా, టఫ్‌గా ఉండే పాత్రను పోషించానని వైష్ణవి చైతన్య చెప్పారు.

నిధులు లేక.. అనుమతి రాక

- హడావుడిచేసి.. అర్ధాంతరంగా నిలిపివేత
- రోగులు, గర్భిణులను డోలీల్లో ఆస్పత్రులకు తరలింపు
- ఇదీ మెళియాపుట్టి మండలంలోని గిరిజన గ్రామాల రోడ్ల పరిస్థితి

(మెళియాపుట్టి)

ప్రతిసారి జరిగే ఎన్నికలకు ఆరునెలల ముందు కొండలపైన ఉన్న గ్రామాలకు రహదారుల పనుల పేరుతో హడావుడి చేసి కొంతమేర పనులు చేసి పూర్తి బిల్లులు చేయించుకుని ఐదేళ్ల ముఖంచాటేస్తున్నారు. అయితే మెళియాపుట్టి మండలంలోని గిరిజన గ్రామాలకు రహదారులు దశాబ్దాలుగా పూర్తికావడంలేదు. ప్రధానంగా నిధులు లేకపోవడంతోపాటు, అటవీశాఖ నుంచి అనుమతి లేకపోవడంతో రోడ్ల పనులు పూర్తికావడంలేదని ఐటీడీఏ అధికారులు చెబుతున్నారు. అధికార పార్టీకి చెందిన నాయకులు, బంధువులకే పనులు అప్పగిస్తుండడంతో పూర్తి చేయకుండా అర్ధాంతరంగా నిలిపివేస్తున్నారని గిరిజనులు ఆరోపిస్తున్నారు. గత ఐదేళ్లుగా వైసీపీ నాయకులు హడావుడిచేసినా పనులు పూర్తిచేయలేదని విమర్శిస్తున్నారు. కొండలపై గ్రామాలకు రహదారులు లేకపోవడంతో అనారోగ్యంతో బాధపడేవారికి డోలీలతో మోసి తీసుకువెళ్లాల్సి వస్తోంది. గతఏడాది గూడ గ్రామానికి చెందిన మహిళకు అర్ధరాత్రి పురిటి నొప్పులు రావడంతో ఎంతో కష్టపడి వైద్యసిబ్బంది కొండ కిందకి దించి ఆరోగ్యకేంద్రానికి తరలించారు. కేరాశింగి గ్రామానికి చెందిన ఓ మహిళ మార్గమధ్యలో ప్రసవమైన విషయం విదితమే. దీంతోపాటు రేషన్ సరుకులు సైతం కింద నుంచే మోసి తీసుకువెళ్లాల్సి వస్తోంది.

ఇదీ పరిస్థితి..

మండలంలోని కేరాశింగి, గూడ, అడ్డివాడ, దబ్బగుడ్డి, చందనగిరి గిరిజన గ్రామాలకు రహదారులు లేకపోవడంతో గిరిజనులు అవస్థలకు గురవుతున్నారు. ఏడాది కిందట ఐటీడీఏ ఉపాధి నిధులు నుంచి చందనగిరికి రూ.1.25 కోట్లు, అడ్డివాడకు రూ.1.75 కోట్లు, కేరాశింగికి రూ.92 లక్షలు, గూడకు రూ. 1.5 కోట్లు నిధులు మంజూరయ్యాయి. ఆయా గ్రామాలకు సిమెంట్ రహదారి వేయాల్సిఉంది. అయితే సిప్స్‌వేసి పనులు నిలిపివేశారు. ఈమేరకు పనులకు సంబంధించి బిల్లులు సైతం అడ్వాన్స్ కింద చేయించుకున్నట్లు విమర్శలువినిపిస్తున్నాయి. దీంతో మళ్లీ వర్షాలు కురిస్తే వేసిన రోడ్డుపై ఉన్న చిప్స్ కరిగిపోయి కొండ దిగువకు వచ్చే చేరుతుందని గిరిజనులు ఆందోళనచెందుతున్నారు. గతంలో ఐటీడీఏ పీవోగా ఉన్న కల్పనాకుమారి సైతం పరిశీలించి పనులు వేగవంతంచేశారు. అయితే కొంతమంది ఇంజినీరింగ్ అధికారుల అశ్రద్ధ వల్ల పనులు అర్ధాంతరంగా నిలిపివేసినట్లు విమర్శలొస్తున్నాయి. నిధులు రాకే పనులు చేయలేకపోతున్నట్లు ఐటీడీఏ అధికారులు చెబుతున్నారు. అయితే ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో గిరిజనుల ఓట్లకోసం మళ్లీ వైసీపీ అధికారం లోకి వస్తేనే అర్ధాంతరంగా నిలిచిన రోడ్ల పనులు జరుగుతాయని మాయ మాటలు చెబుతున్నారని గిరిజన సంఘ, ప్రతిపక్ష నాయకులు ఆరోపిస్తున్నారు. ఐదేళ్లుగా చేయలేని వారు మళ్లీ అధికా రంలోకి వస్తే ఎలా చేస్తారని ప్రశ్నిస్తున్నారు. అత్యవసర సమయంలో రోగులు, గర్భిణులకు డోలీల్లో ఆస్పతులకు తరలిస్తున్నట్లు గిరిజనులు వాపోతున్నారు.


అర్ధాంతరంగా నిలిచిన కేరాశింగి రహదారి పనులు


గర్భిణుని డోలీలో తీసుకువస్తున్న దబ్బగుడ్డి గిరిజనులు (ఫైల్)


కొండపై నుంచి దిగుతున్న గర్భిణి (ఫైల్)

ఓట్లు వేసిన తర్వాత పనులు చేయడంలేదు..



ఎన్నికల ముందు పనులు మొదలైనట్లు చేసి ఓట్లు వేసిన తర్వాత రహదారి పనులు పూర్తి చేయడం లేదు. ఎమ్మెల్యే రెడ్డిశాంతి రహదారి పనులు పూర్తిచేసి ఓట్లకు వస్తామన్నారు. కాని ఎన్నికలు వచ్చినా రహదారి పనులు పూర్తికాలేదు. దీంతో స్థానిక వైసీపీ నాయ కులు మభ్యపెట్టి ఓట్లు వేయించుకోవడానికి ప్రయత్నాలు చేస్తున్నారు.

-సరవ రాము, కేరాశింగి, మెళియాపుట్టి మండలం

పనులు నిలిపివేశారు..



అదిగోఆదిగో అంటు ఎన్నికలు ముందు పనులు ప్రారంభించి అర్ధాం తరంగా నిలుపుదల చేశారు. వర్షాలు కురిస్తే రహదారిపై ఉన్న రాయి, మట్టి కొట్టుకుపోతున్నాయి. దీంతో మళ్లీ మొదటికే సమస్య వస్తుంది.

-ఎస్.సోమేష్, కేరాశింగి, మెళియాపుట్టి మండలం

బాధలు తప్పడం లేదు..

మాకు బాధలు తప్పడం లేదు. అనారోగ్యానికి గురైతే డోలీ కట్టి కిందకు దింపుతారు. అక్కడి నుంచి 108 వాహనాల ద్వారా ఆసుపత్రికి తీసుకు వెళ్తున్నారు. ఎన్నికల ముందే మేము గుర్తొస్తున్నాం.

-ఎస్.లక్ష్మిమ్మ, కేరాశింగి, మెళియాపుట్టి మండలం

మధ్యవర్తిత్వంపై అవగాహన అవసరం


మాట్లాడుతున్న మాధురి

పలాస: మధ్యవర్తిత్వంపై న్యాయవాదులు అవగాహన కలిగిఉండాలని స్థానిక జూనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి యు.మాధురి కోరారు. గురువారం స్థానిక కోర్టు ఆవరణలో రాష్ట్ర, జిల్లా న్యాయసేవాధికారసంస్థల ఆదేశాల మేరకు న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాధురి మధ్యవర్తిత్వంపాత్ర, వాటివల్ల కలిగే ప్రయోజనాలు, ఆవశ్యకత వంటిఅంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్. విశ్వేశ్వరరావు, కార్యదర్శి పిండి వెంకటరావు, సహ కార్యదర్శి జీఎంఎస్ అనిల్‌రాజు, ఉపాధ్య క్షుడు ఫైయ్యాజ్ అహ్మద్ (ఘని), పైల రాజరత్నం, పీఎల్.నారాయణ, చంద్రశేఖర్, బీకేఆర్ పట్నాయక్, రవి పట్నాయక్ పాల్గొన్నారు.

ఏపీఆర్డీసీలో సత్తాచాటిన లక్కివలస విద్యార్థి

సంతబొమ్మాళి: మండలంలోని లక్కివలస గ్రామానికి చెందిన బుడ్డెపు సాయి కృష్ణారెడ్డి ఏపీఆర్జీసీలో సత్తాచాటాడు. 118 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో ఎంపీసీ విభాగంలో ఒకటో ర్యాంకు సాధించాడు. సాధారణ రైతు కుటుంబానికి చెందిన సాయికృష్ణారెడ్డి విశాఖలోని ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్ చదివాడు.

అచ్చెన్నను కలిసిన బాలబ్రహ్మానంద సరస్వతి

టెక్కలి: నిమ్మాడలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడును గురువారం నైమిషారణ్య పీఠాధిపతి బాలబ్రహ్మానంద సరస్వతి కలుసుకున్నారు. ఈ సందర్భంగా అచ్చెన్నాయుడుకు వేదమంత్రాలతో ఆశీర్వచనం చేసి పీఠంలో వెలసిన వారాహి అమ్మవారి శేష వస్త్రం కప్పారు.

స్ట్రాంగ్‌రూము పరిశీలన

టెక్కలి: ఎచ్చెర్లలోని శివానీ కళాశాలలో ఉన్న ఈవీఎం స్ట్రాంగ్‌రూము సీల్‌ను ఆర్వో నూరుల్‌కమర్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో పరిశీలించారు.టీడీపీ తరపున కింజరాపు హరివరప్రసాద్, లాయర్ అచ్చెన్నాయుడు, వెలమల కామేశ్వరరావు, కాంగ్రెస్ తరపున టీటీజీ గుప్త, వైసీపీ తరపున పినకాన వైకుంఠరావు, బీఎస్పీ తరపున చింతాడ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

చెత్తను తీశారు.. వదిలేశారు

- టెక్కలిలో పాదచారులు, వాహనచోదకుల అవస్థలు


రామదాసుపేట జంక్షన్ వద్ద కాలువపై పలకను తొలగించిన దృశ్యం

టెక్కలి: నిత్యంరద్దీగా ఉండే టెక్కలి చిన్నబజారు నుంచి రామదాసుపేట వెళ్లే మార్గంలో కల్వర్టులో చెత్తను తొలగించేందుకు ఈనెల పదోతేదీన పంచాయతీ యంత్రాంగం కాలువపై ఉన్న పలకను తొలగించి చెత్తను రోడ్డు మీద వేసేశారు. దీంతో వాహనచోదకులు, పాదచారులు ఆ మార్గం గుండా రాకపోకలు సాగించేందుకు అవస్థలుపడుతున్నారు. చెత్త తొలగించలేదు సరికదా కాలువపై పలకను సరిచేయలేదు. నిత్యంరద్దీగా ఉండే రామదాసు పేట రోడ్డుపై ఉన్న మురుగు నిల్వల వల్ల కూడా ఇబ్బందిపడుతున్నారు.తక్షణమే చెత్తను తొలగించికాలువపై పలకను ఏర్పాటుచేసి రాకపోకలకు సౌకర్యం కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.

రేపటి నుంచి శ్రీవారి బ్రహ్మోత్సవాలు

నరసన్నపేట: స్థానిక వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం నుంచి జరిగే శ్రీవారి బ్రహ్మోత్సవాలకు ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయ ప్రాంగణంలో పందిళ్లవేసి అలంకరించారు. పదిరోజుల పాటు జరిగే ఉత్సవాల్లో భాగంగా కోలాటం, వివిధ జానపద నృత్యబృందాలు సిద్ధం చేశారు. అలాగే మొదటి రోజు బ్రహ్మోత్సవాలను ప్రారంభించేందుకు వివిధ ప్రాంతాల నుంచి వాయిద్యకారులు, రుత్వికులను ఆహ్వానించారు.

నేటి నుంచి వేంకటేశ్వర ఆలయ వార్షికోత్సవం

నందిగాం: మండలంలోని పెంటూరులో కొలువుదీరిన వేంకటేశ్వర దేవస్థానం 22వ వార్షికోత్సవం శుక్రవారం నుంచి మూడురోజులు నిర్వహించనున్నట్లు శాశ్వత ధర్మకర్తలు బొడ్డ జనార్దనరావు, కృష్ణారావు తెలిపారు.శుక్రవారం సుప్రభాతసేవ, ఆరాధన, నిత్య ప్రభోదిక, సాయంత్రం విశ్వకేశనపూజ, పుణ్యాహవచనం, విశేష హోమాలు జరుగుతాయని పేర్కొన్నారు.

నీలమణిదుర్గ ఆలయ వార్షిక మహోత్సవాలు


పూజల్లో పాల్గొన్న భక్తులు

పాతపట్నం: స్థానిక నీలమణిదుర్గ ఆలయంలో 49వ వార్షికోత్సవాల్లో భాగంగా గురువారం ప్రత్యేకపూజలు చేశారు.లలితఅష్టోత్తర శతనామార్చనలు, ఆవరణ దేవ తసహిత సూర్యభగవానుని, మూలమంత్రం హోమాలు జరిగాయి.

సమావేశాలు నిషేధం: ఎస్ఐ


వజ్రపుకొత్తూరు: ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండలంలో 144 సెక్షన్ అమలులో ఉండడంతో సభలు, సమావేశాలు ఏర్పాటుచేయరాదని వజ్రపుకొత్తూరు ఎస్ఐ రామారావు చెప్పారు. ఎన్నికల ఫలితాలు వచ్చే వరకూ నిషేధం కొనసాగుతుందని తెలిపారు.

తాగు నీరు వృథా

పలాస రూరల్: మండలంలోని మామిడిపల్లి జంక్షన్‌లో ఏర్పాటు చేసిన మంచినీటి కొళాయి నుంచి నీరువృథాగాపోతోంది. ప్రస్తుతం నీటికోసం అల్లాడుతున్న సమయంలో వృథాగా నీరు పోతుండడంపై గ్రామస్థులు ఆందోళన వ్యక్తంచేశారు. ఇప్పటికైనా అధికారులు కొళాయి వద్ద లీకులను అరికట్టి తాగు నీటి వృథా కాకుండా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.


కొళాయి వద్ద వృథాగా పోతున్న నీరు

ఆదమరిస్తే అంతే


ప్రమాదకరంగా మారిన కొళాయి గొయ్యి

పలాసరూరల్: పలాస మండల కాంప్లెక్స్ సాయికాలనీ స్కూల్ వద్ద నీటి కొళాయి కోసం ఏర్పాటు చేసిన గొయ్యి పూడ్చకపోవంతో ప్రమాదాలు చోటుచేసుకునే అవకాశం ఉందని పలువురు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఈ రహదారి గుండా విద్యార్థులు విద్యాసంస్థలకు రాకపోకలు సాగిస్తున్నారు. ఇక్కడ ఆదమరిస్తే ప్రమాదాలు తప్పవని పలువురు చెబుతున్నారు.

పార్టీ అభివృద్ధికి దోహదపడాలి

జలుమూరు: ఇక నుంచి కూడా నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అండగా నిలిచి పూర్తి సహాయ సహకారాలు అందించి పార్టీ అభివృద్ధికి దోహదపడాలని టీడీపీ రాష్ట్ర బీసీ కమిటీ ప్రతినిధి ధర్మాన తేజకుమార్ ఒక ప్రకటనలో కోరారు. ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు కింజరాపు రామ్మోహన్‌నాయుడు, బగ్గు రమణమూర్తి ఎన్నికల ప్రచారంలో సహకరించడంతో కృతజ్ఞతలు తెలిపారు.

పలాసలో గౌతు శిరీష జన్మదిన వేడుకలు


కేక్ కట్ చేస్తున్న బాబూరావు, టీడీపీ నాయకులు

పలాస: స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, పలాస నియోజకవర్గ కూటమి అభ్యర్థి గౌతుశిరీష జన్మదిన వేడుకలు గురువారం నిర్వహించారు. మాజీ మంత్రి గౌతు శ్యామసుందరశివాజీ, విజయమ్మ దంపతులు సీతారామాలయం, షిర్డీసాయి మందిరంలో పూజలుచేసి అన్నదాన కార్యక్రమం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు, భవానీ దంపతులు కేకును కట్‌చేసి శిరీషకు శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి గాలి కృష్ణారావు ఆధ్వర్యంలో ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంచిపెట్టారు. శిరీషకు విజయనగరం టీడీపీ ఎంపీ అభ్యర్థి కలిశెట్టి అప్పలనాయుడు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో గురిటి సూర్యనారాయణ, బడ్డ నాగరాజు, నవీన్, శంకర్, శాసనపురి మురళీకృష్ణ, మల్లా శ్రీనివాస్, గొరకల వసంతరావు, కొర్ల కన్నారావు, సూరాడ మోహనరావు, ఎం.నరేంద్ర పాల్గొన్నారు.

వలకు చిక్కిన సముద్రపాము

వజ్రపుకొత్తూరు: మంచినీళ్లపేట సముద్ర తీరంలో మత్స్యకారుల వలకు పది అడుగుల సముద్ర పాము చిక్కింది. ప్రస్తుతం మరబోట్లతో వేట నిషేధం కొనసాగుతోంది. కాగా.. గురువారం మంచినీళ్లపేటకు చెందిన మత్స్యకారులు సంప్రదాయ వలతో వేట సాగించగా.. చనిపోయిన సముద్రపాము చిక్కింది. 'ఇది విషపూరితం కాదు. కొన్ని ప్రాంతాల వారు పాము తలను తొలగించి మిగిలిన భాగం కూర వండుకొని తింటారు. ఈ పాము మాంసం తింటే వెన్నుపూసకు మంచిది. చైనాలో ఈ రకం జాతి పాములకు డిమాండ్ అధికంగా ఉంటుంది' అని స్థానిక మత్స్యకారులు తెలిపారు.



చెత్త తొలగించాలి: ఎంపీడీవో

నందిగాం: గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాలు విస్తృతపరచాలని ఈవోపీఆర్డీ టి.రాజారావు కార్యదర్శులను సూచించారు. గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో కార్యదర్శులతో సమావేశం ఏర్పాటుచేశారు. గ్రామాల్లో వాతావరణ మార్పుల ప్రభావంతో వ్యాధులు ప్రబలే అవకాశంఉండడంతో మురికికాలువల్లో చెత్త తొలగింపు, క్లోరినేషన్ కార్యక్రమాలు చేపట్టాలన్నారు.వీధిదీపాల నిర్వహణ బాధ్యత తీసుకోవాలని సూచించారు. కాగా యాంటీ మలేరియాలో భాగంగా దోమలు నివారణకు పంచాయతీలకు లిక్విడ్ మందుల్ని గురువారం సరఫరా చేశారు. ఆయా పంచాయతీల పరిధిలో మురుగు కాలువలు, నీటికుంటలు, వర్షపునీటి నిల్వ ప్రాంతాల్లో స్ప్రే చేసి వ్యాధుల నివారణకు చర్యలు తీసుకోవాలని సూచించారు.

కాలువల్లో పేరుకుపోయిన డెక్క

- ఆందోళన చెందుతున్న ఆయకట్టు రైతులు


గుర్రపు డెక్కతో నిండిన 19ఆర్ కూర్మనాథపురం కాలువ

జలుమూరు: మండలంలోని 19ఆర్ కూర్మనాధపురం కాలువ, 18ఆర్, 10ఆర్ తదితర కాలువల్లో గుర్రపు డెక్క పేరుకుపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభంకానుండడంతో రైతులు పొలాలు సిద్ధంచేస్తున్నారు. అయితే గతంలో ఏప్రిల్‌లో కాలువల్లో పూడిక, డెక్క తొలగించేందుకు జలవనరుల శాఖ అధికారులు చర్యలు తీసుకునేవారు. ఈ ఏడాది మే రెండోవారం పూర్తవుతున్నా డెక్క తొలగింపుపై అధికారులు టెండర్లు సైతం పిలవలేదు. ఇక్కడ టీడీపీ హయాంలో తీయించిన పూడికలు తప్ప వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత కాలువల్లో డెక్క ఒక్కసారి కూడా తొలగించలేదు. దీంతో అందవరం, రామకృష్ణాపురం, పర్లాం, యాతపేట, ఉప్పరపేట తదితర గ్రామాల్లోని శివారు ఆయకట్టుకు ఖరీఫ్‌లో సైతం నీరందడంలేదు. దీంతో రైతులే ఏటాఏటా శ్రమదానం చేసి కాలువల్లోని గుర్రపుడెక్కను తొలగించి పొలాలకు కొంతమేర సాగునీరందేలా చర్యలు తీసుకుంటున్నారు. అందవరం, పర్లాం, రామకృష్ణాపురం తదితర ప్రాంతాలకు సాగునీరు అందించి ఆదుకుంటామని వైసీపీ నాయకులు ఇచ్చిన హామీలు నీటిమూటలుగానే మిగిలిపోయాయని రైతులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ఖరీఫ్‌కు అందవరం, తదితర శివారు ప్రాంతాల్లో భూములకు సాగునీరు అందించి ఆదుకోవాలని పలువురు రైతులు కోరుతున్నారు.

జీడి ఉత్పత్తి కేంద్రాలు పూర్తిచేయాలి: ఏపీడీ


మాట్లాడుతున్న సన్యాసిరావు

మందస: మందసలో వన్-ధన్-వికాస్‌కేంద్రాల ద్వారా జీడిఉత్పత్తి కేంద్రాలు త్వరగా పూర్తిచేయాలని సీతంపేట వెలుగు ఏపీడీ ఎం.సన్యాసిరావు కోరారు. గురువారం మందస మండల సమాఖ్య కార్యాలయంలో సీఎఫ్‌లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మందస గిరిజన ప్రాంతానికి మంజూరైన ఎనిమిది జీడి ఉత్పత్తి కేంద్రాల పనులు పూర్తిచేయాలని తెలిపారు. సమా వేశంలో రైతులు నారాయణరావు, బి.ప్రసాదరావు, ఎస్.కాంతమ్మ, సుబ్బయ్యనాయుడు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

జలుమూరు: మండలంలోని కరవంజ ఉన్నతపాఠశాలలో 2002-03లో పదో తరగతి చదివిన పూర్వవిద్యార్థులు గురువారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎక్కడెక్కడో స్థిరపడిన వారంతా ఒకచోట చేరి గత అనుభవాలు నెమరు వేసుకున్నారు. 21 సంవత్సరాల తర్వాత కలుసుకున్న వారంతా ఒకరికొకరు పలకరించుకొని వారి జీవన స్థితిగతులు పంచుకుని రోజంతా ఆనందంగా గడిపారు. అనంతరం ఆనాటి ఉపాధ్యాయులను పూర్వవిద్యార్థులు సన్మానించారు.


ఆనాటి ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

పబ్లిక్ నోటీసు

నా క్లయింటు M/s. శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ కె.టి.రోడ్ కాశీబుగ్గ వారి భోగట్టాపై ఇస్తున్న పబ్లిక్ నోటీసు. శ్రీకాకుళం జిల్లా, కవిటి మండలం, సన్యాసిపుట్టుగ గ్రామ కాపురస్థులైన శ్రీ పురుషోత్తం జయలక్ష్మి W/o గురుమూర్తి నా క్లయింటు సంస్థ నుండి తీసుకొనబోవు ఋణమునకు హామీగా అతని స్వాధీన, హక్కు అనుభవములోనున్న ఈ దిగువ షెడ్యూలులో వివరించిన ఆస్తిని తాకట్టుగా పెట్టుటకు ప్రతిపాదించియున్నారు. కావున సదరాస్తిపై వేరే వారికయినా ఎట్టి హక్కుగాని, ఆసక్తిగాని ఉన్న యెడల [illegible]

D.V.Viveikananda, Advocate, Tekkali, Cell : 9440436751

పబ్లిక్ నోటీసు

నా క్లయింటు M/s. శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ కె.టి.రోడ్ కాశీబుగ్గ వారి భోగట్టాపై ఇస్తున్న పబ్లిక్ నోటీసు. శ్రీకాకుళం జిల్లా, కవిటి మండలం, రాజపురం గ్రామ కాపురస్థులైన శ్రీ లోళ్ల పద్మనాభం S/o లక్ష్మణమూర్తి నా క్లయింటు సంస్థ నుండి తీసుకొనబోవు ఋణమునకు హామీగా అతని స్వాధీన, హక్కు అనుభవములోనున్న ఈ దిగువ షెడ్యూలులో వివరించిన ఆస్తిని తాకట్టుగా పెట్టుటకు ప్రతిపాదించియున్నారు. కావున సదరాస్తిపై [illegible]

D.V.Viveikananda, Advocate, Tekkali, Cell : 9440436751

పబ్లిక్ నోటీసు

[illegible] ... అసక్తిగాని ఉన్న యెడల అట్టివారు ఈ నోటీసు ప్రచురించబడిన ఏడు దినములలోగా వారి యొక్క అభ్యంతరములను నాకుగాని, నా క్లయింటుకుగాని తెలియపరచవలెను. లేని యెడల సదరాస్తిపైగాని, దానిపై జరుపబోవు తాకట్టుపై గాని ఎవరికీ ఎట్టి అభ్యంతరములు లేవని భావించబడునని యిందుమూలంగా యావన్మందికి తెలియజేయడమైనది.

షెడ్యూలు-1: శ్రీకాకుళం జిల్లా, పలాస మండలం, కోసంగిపురం గ్రామంలో సర్వే నెం. 51/11బి1 గల తూ॥ప॥లకు 15అ॥, ఉ॥ద॥లకు 50అ॥ మొత్తం 83.33చ॥గ॥ గల స్థలంకి హద్దులు: తూ॥: 24అ॥ వెడల్పు గల రోడ్డు, ద॥: 20అ॥ వెడల్పు గల రోడ్డు, ప॥: కోల రాజ్‌కుమార్ స్థలం, ఉ॥: నాతాలూకా మిగతా స్థలం,

షెడ్యూలు-2: హద్దులు: తూ॥: కోల కామేశ్వరి స్థలం, ద॥: 20అ॥ వెడల్పు గల రోడ్డు, ప॥: జామి సంజీవి స్థలం, ఉ॥: నాతాలూకా మిగతా స్థలం,

షెడ్యూలు-3: హద్దులు: తూ॥: కోల రాజ్‌కుమార్ స్థలం, ద॥: 20అ॥ వెడల్పు గల రోడ్డు, ప॥: జామి పాపారావు స్థలం, ఉ॥: నాతాలూకా మిగతా స్థలం,

D.V.Viveikananda, Advocate, Tekkali, Cell : 9440436751



గ్రామాల్లో తాగునీటి కష్టాలు

- అడుగంటిన నేల బావులు
- నీటి సరఫరా చేయాలని కోరుతున్న మహిళలు

కంచిలి: ఒకవైపు వేసవి ఉష్ణోగ్రతలు తీవ్రమవుతున్న నేపథ్యంలో మండల పరిధిలోని గ్రామాల్లో తాగునీటి కష్టాలు మొదలయ్యాయి. గ్రామాల్లోని బావుల్లో పూర్తిగా నీరు ఎండిపోవడమే కాకుండా తాగునీటి కొళాయిల ద్వారా అందిస్తున్న నీటి సరఫరా కనీస అవసరాలకే చాలడం లేదని మహిళలు వాపోతున్నారు. గ్రామాల్లోని తాగునీటి పథకాల ద్వారా సరఫరా చేస్తున్న నీరు చాలా తక్కువగా ఉంటోందని, కనీస అవసరాలే తీరడం లేదని మహిళలు చెబుతున్నారు. చాలాచోట్ల కొళాయి పైపులు సరిగా లేక నీరు వృథాగా పోతోంది. జల్ జీవన్ మిషన్ ద్వారా ఇంటింటికీ తాగునీరు అందించేందుకు అధికారులు పూర్తిస్థాయిలో చర్యలు తీసుకోకపోవడంతో సగానికి పైగా గ్రామాలకు పైపు లైనులు కూడా వేయని దుస్థితి నెలకొంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ట్యాంకర్ల ద్వారా తాగునీటి సరఫరా చేయాలని మహిళలు కోరుతున్నారు.


కొళాయిల వద్ద తాగునీటి కోసం వేచి ఉన్న మహిళలు

అడుగంటిన బావులు

సరైన వర్షాలు లేక భూగర్భ జలాలు అడుగంటి, చెరువుల్లో నీళ్లులేని పరిస్థితులు నెలకొంది. దీనికితోడు గ్రామాల్లోని బావులు సైతం అడుగంటడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కంచిలి మెయిన్ రోడ్డుతోపాటు ఎస్ఆర్‌సీ పురం, పురుషోత్తపురం, గొల్లకంచిలి, జెన్నాపుయి, ఎంఎస్ పల్లి, అంపురం, దాళేశ్వరం తదితర గ్రామాల్లో బావులు అడుగంటి, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

సత్వర చర్యలు చేపట్టండి

వేసవి తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో తాగునీటికి ఇబ్బందులు ఏర్పడకుండా అధికారులు ట్యాంకర్లతో నీటిని సరఫరా చేయాలని స్థానికులంతా కోరుతున్నారు. అలాగే మరమ్మతులకు గురైన తాగునీటి పథకాలను బాగుచేయించాలని వారంతా కోరుతున్నారు.


పురుషోత్తపురంలో అడుగంటిన నేలబావి

పరిష్కారానికి చర్యలు

గ్రామాల్లో తాగునీటికి సంబంధించి సమస్య మా దృష్టికి వచ్చింది. రెండు రోజుల్లో ఈ సమస్య పరిష్కారానికి కృషిచేస్తాం. గ్రామాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకుంటాను.

- సతీష్, జేఈ ఆర్‌డబ్ల్యూఎస్

అనుమానాస్పద స్థితిలో ఒకరు మృతి

- సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ తరఫున పోలింగ్ ఏజెంట్‌గా విధులు


జానారావు(ఫైల్)

పలాస రూరల్: పెదంచల గ్రామానికి చెందిన వరిశ జానారావు రోడ్డు ప్రమాదానికి గురై గురువారం మృతి చెందాడు. జానారావు మృతిపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. స్థానిక టీడీపీ నాయకుల కథనం మేరకు.. జానారావు ఇటీవల జరిగిన ఎన్నికల్లో టీడీపీ తరుపున పోలింగ్ ఏజెంట్‌గా వ్యవహరించాడు. ఎన్నికల తర్వాత రోజు మంగళవారం ఆయన తన వ్యక్తిగత పని మీద విశాఖపట్నం ద్విచక్రవాహనంపై బయలుదేరాడు. గంగువాడ-ఈదురాపల్లి గ్రామాల మధ్య రోడ్డు మీద పడి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. ఈ విషయం స్థానికులు గుర్తించి జానారావును కాశీబుగ్గలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా, మెరుగైన చికిత్స కోసం శ్రీకాకుళం తరలించగా గురువారం మృతిచెందాడు. కాగా ఇంటి నుంచి బయలుదేరిన కొద్ది సేపటిలోనే రోడ్డు ప్రమాదానికి గురికావడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. జానారావు టీడీపీ పోలింగ్ ఏజెంట్‌గా పని చేయడమే కారణమా లేదా బైకు ప్రమాదానికి గురై అపస్మారక స్థితికి చేరాడా, ఇతరులెవరైనా దాడికి పాల్పడ్డారా అన్న విషయంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. జానారావుకు భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. కాగా ఈ విషయంపై కాశీబుగ్గ పోలీసులకు ఆంధ్రజ్యోతి వివరణ కోరగా తమకు పూర్తిస్థాయి సమాచారం రాలేదని, సమాచారం వస్తే దర్యాప్తు చేస్తామని చెప్పారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం


ప్రమాదంలో నుజ్జయిన కారు వెనుక భాగం

ఎచ్చెర్ల: ఫరీద్‌పేట పంచాయతీ కొయ్యరాళ్ల జంక్షన్ జాతీయ రహదారిపై గురువారం ఆగి ఉన్న కారును వెనుక నుంచి లారీ బలంగా ఢీకొట్టింది. విశాఖ నుంచి శ్రీకాకుళం వైపు వస్తున్న కారు కొయ్యరాళ్ల కూడలి వద్ద ఆపి.. కారులో ఉన్నవారు దిగుతున్నారు. ఇదే సమయంలో వెనుక నుంచి వచ్చిన లారీ ఢీకొట్టింది. అప్పటికే కారు డ్రైవర్ మినహా మిగిలిన వారంతా దిగిపోయారు. దీంతో కారు డివైడర్‌ను ఢీకొట్టగా వెనుకభాగం పూర్తిగా పాడైంది. అదృష్టవశాత్తూ కారు డ్రైవర్‌కు ఎలాంటి గాయాలు లేకపోవడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు. వర్షం కారణంగా లారీ వేగాన్ని నియంత్రించకపోవడంతోనే ఈ ప్రమాదం జరిగినట్టు స్థానికులు చెబుతున్నారు. ఈ మేరకు ఎచ్చెర్ల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం సీసాల ధ్వంసం

సోంపేట: ఇటీవల ఎక్సైజ్‌దాడుల్లో స్వాధీనం చేసుకున్న 4,817 మద్యం సీసాలను గురువారం ధ్వంసం చేశారు. విశాఖ స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఆదేశాల మేరకు పలాస డివిజన్ అసిస్టెంట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ ఇస్మత్ ఆరాబేగం, ఎక్సైజ్ ఎస్ఐ ఆర్.జైభీమ్, సిబ్బంది ఆధ్వర్యంలో చేపట్టారు.

విద్యుత్తు స్తంభాన్ని సరిచేశారు..

గార: ఆరంగిపేట సమీపంలో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్తు స్తంభాన్ని గురువారం సరిచేశారు. 'ఆంధ్రజ్యోతి'లో 'ప్రమాదకరంగా విద్యుత్తు స్తంభం' శీర్షికతో ప్రచురితమైన కథనానికి ఆ శాఖ అధికారులు స్పందించారు. దీంతో ఏఈ ఎల్.పవనమూర్తి తన సిబ్బందితో వెళ్లి ఆ స్తంభాన్ని సరిచేయించారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్


సరి చేసిన విద్యుత్ స్తంభం

సీపీఎస్ రద్దుకు నిరంతర పోరాటం


ఎన్నికైన నూతన కమిటీ

అరసవల్లి: సీపీఎస్‌ను రద్దు చేసి, ఓపీఎస్‌ను అమలు చేయాలని ఉమ్మడి తెలుగు రాష్ట్రాల ఏపీటీఎఫ్ పూర్వాధ్యక్షుడు, ఐఫియా జాతీయ కార్యదర్శి సన్నశెట్టి రాజశేఖర్ డిమాండ్ చేశారు. గురువారం నగరంలోని ప్రభుత్వ మహిళా కళాశాలలో ఏపీటీఎఫ్ జిల్లా నూతన జనరల్ కౌన్సిల్ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సీపీఎస్ రద్దు కోసం నిరంతర పోరాటమే మార్గమని, దానికి వేరే ప్రత్యామ్నాయం లేదన్నారు. ఈ సమావేశంలో ఏపీటీఎఫ్ జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్ష, కార్యదర్శులుగా బల్లెడ రవి, బుక్కూరు వెంకటేశ్వర్లు, సహాధ్యక్షుడిగా బలగ శ్రీనివాసరావు, అదనపు కార్యదర్శిగా పొన్నాడ బాలాజీరావు, ఉపాధ్యక్షుడిగా భుజంగరావు, అనంతాచార్యులు, రమణ, నవీన్, కార్యదర్శులుగా శివరావు, జోగారావు, జితేంద్ర, జోగారావు, రాజబాబు, కృష్ణారావు, శ్రీనివాసరావు, చిన్నారావు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో చింతాడ దిలీప్‌కుమార్, జిల్లా నలుమూలల నుంచి వచ్చిన మండల శాఖల అధ్యక్ష, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

సందడిగా ముత్యాలమ్మ పండగ



శ్రీకాకుళం కల్చరల్: నగరంలో ముత్యాలమ్మ తల్లి పండగ మహోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా అమ్మవారి చల్లదనం కోసం ముందురోజు రాత్రి మట్టి పిడతల్లో తొలికుండ అన్నం తీసి, పెరుగు, నీళ్లు, ఉల్లిపాయ వేసి గురువారం ముత్యాలమ్మ అమ్మవారికి సమర్పించారు. 108 మంది మహిళలుతో ఊరేగింపుగా వెళ్లి చల్లదనం చేపట్టారు. ఈ సందర్భంగా తప్పెటగుళ్లు, డప్పు సన్నాయి మేలంతో ఊరేగింపుగా అమ్మవారిని ఊరేగించారు. అమ్మవారి ఘటం గంధంవారి ఇంటి నుంచి ముత్యాలమ్మ కోవెల మీదుగా కామాక్షమ్మ ఆలయం, సంపత్ వినాయక ఆలయం, హనుమాన్ జంక్షన్, మేదర వీధి, చిన్నబజార్, ఉమెన్స్ కళాశాల మీదుగా అఫీషియల్ కాలనీ సమీపంలోని మరిడమ్మ ఆలయానికి చేరుకుని పూజలు చేశారు.


అలంకరణలో అమ్మవారు, దర్శనానికి వచ్చిన భక్తులు

గురుకుల పాఠశాలకు హనీష్ ఎంపిక

ఎచ్చెర్ల: ముద్దాడపేట ప్రాథమిక పాఠశాలలో నాలుగో తరగతి చదువుతున్న పంచిరెడ్డి హనీష్ ఏపీ గురుకుల పాఠశాల ఐదో తరగతిలో ప్రవేశానికి ఎంపికైనట్టు హెచ్ఎం బొడ్డేపల్లి విజయమ్మ తెలిపారు. ఈ పాఠశాలలో 2017 నుంచి ఇప్పటి వరకు వివిధ గురుకుల పాఠశాలలకు 15 మంది విద్యార్థులు ఎంపికయ్యారని చెప్పారు. ఈ విద్యార్థి ఎంపికపై ఉపాధ్యాయులు పైడి శ్రీరామ్మూర్తి, సీహెచ్ గోవిందరావు, ప్రసాదరావు, పి.నర్మద హర్షం వ్యక్తంచేశారు.

క్రీడాకారులకు అండగా ఉంటా: గొండు శంకర్


క్రీడా సామగ్రి అందిస్తున్న గొండు శంకర్

గుజరాతీపేట/ అరసవల్లి: క్రీడలకు, క్రీడాకారులకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి శ్రీకాకుళం నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి గొండు శంకర్ అన్నారు. గురువారం స్థానిక ఆర్ట్స్ కళాశాల మైదానంలో ఎన్‌టీఆర్ ఎంఎస్ఎస్ టీం (శ్రీకాకుళం ఎన్టీఆర్, మోక్షజ్ఞ సేవా సంఘం) ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి క్రీడలకు ఎంపికైనవారికి స్పోర్ట్స్ షూస్, హర్డిల్స్, ఇతర సామగ్రి శంకర్ అందజేశారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ.. క్రీడాకారులను ప్రోత్సహించాలనే మంచి ఆశయంతో ఇటువంటి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న వారిని అభినందించారు. అధికారంలోకి రాగానే కోడి రామ్మూర్తి స్టేడియాన్ని వీలైనంత వేగంగా పూర్తి చేసి క్రీడాకారులకు అందిస్తామని అన్నారు. అలాగే అంపోలు దగ్గర స్టేడియాన్ని కూడా పూర్తిగా అభివృద్ధి చేసి రాబోయే రోజుల్లో జిల్లాలో క్రీడాభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నగర టీడీపీ అధ్యక్షుడు మాదారపు వెంకటేష్, టీడీపీ నాయకులు చల్లా వాసు, జగన్, పేట పద్మ, శిక్షకులు శ్రీనివాస్, తేజ, సురేంద్ర, సురేష్, భాస్కర్, మోహన్, రాజు, మహేష్, క్రీడాకారులు, యువత, తదితరులు పాల్గొన్నారు.

మధ్యవర్తిత్వంపై అవగాహన ఉండాలి


మాట్లాడుతున్న జూనియర్ సివిల్ న్యాయాధికారి

ఇచ్ఛాపురం: మధ్యవర్తిత్వంపై న్యాయవాదులు అవగాహన కలిగి ఉండాలని జూనియర్ సివిల్ నాయాధికారి, మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ పి.పరేష్‌కుమార్ అన్నారు. ఈ మేరకు గురువారం కోర్టు ఆవరణలో న్యాయవాదులతో విజ్ఞా సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు నందకి రమణయ్యరెడ్డి, న్యాయవాదులు గిన్ని సీతయ్యరెడ్డి, పి.వరలక్ష్మి, ప్రసాద్‌రెడ్డి, నాగరాజుపాత్రో, డి.కృష్ణమూర్తిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ జంక్షన్‌లో ట్రాఫిక్ జామ్


నిలిచిపోయిన వాహనాలు

ఇచ్ఛాపురం: పట్టణ పరిధి మార్కెట్ జక్షన్ వీకే పేట రోడ్డులో నిత్య ట్రాఫిక్ జామ్‌తో ప్రజలు, విద్యార్థులు, వ్యాపారులు ఇబ్బంది పడుతున్నారు. గురువారం ఈ జంక్షన్ వద్ద లారీలు, ఇసుక ట్రాక్టర్లు, ద్విచక్ర వాహనాలు, కార్లు ఒక్కసారి రావడంతో ట్రాఫిక్ సమస్య ఎదురైంది. దీంతో ప్రజల రాకపోకలకు గంటపాటు అంతరాయం ఏర్పడింది. ఈ జంక్షన్ వద్ద నిత్యం ట్రాఫిక్ సమస్య ఎదురవుతున్నా పట్టించుకునే నాథుడు కరువయ్యాడని ప్రజలు మండిపడుతున్నారు.

అవయవదానంతో మరో ముగ్గురికి పునర్జన్మ

- 14న రోడ్డు ప్రమాదంలో గాయపడిన శ్రీనివాసరావు
- 15న బ్రెయిన్ డెడ్‌గా నిర్ధారణ
- అవగాహనతో కుటుంబసభ్యుల అంగీకారం


కుటుంబ సభ్యులకు ధ్రువపత్రాన్ని అందిస్తున్న దృశ్యం

అరసవల్లి/ శ్రీకాకుళం రూరల్: అతడు మరణించినా మరో ముగ్గురికి పునర్జన్మను ప్రసాదించాడు. వివరాల్లోకి వెళ్తే.. శ్రీకాకుళం మండలం, చిన్న మండలవీధికి చెందిన తోట శ్రీనివాసరావు(46) ఈ నెల 14న తన ఫ్రెండ్స్‌తో కలిసి ఆటోలో వెళుతుండగా సూర్యమహల్ జంక్షన్ వద్ద ప్రమాదానికి గురయ్యారు. ఈ ప్రమాదంలో శ్రీనివాసరావు తీవ్రంగా గాయపడి చికిత్స నిమిత్తం జెమ్స్ ఆసుపత్రిలో చేర్చారు. రెండు రోజులుగా వెంటిలేటర్‌పై ఆయనకు వైద్యులు చికిత్స అందిస్తూ వచ్చారు. అయినా చికిత్సకు ఏమాత్రం స్పందించకపోవడంతో ఈ నెల 15న అర్ధరాత్రి దాటిన తర్వాత బ్రెయిన్ డెడ్ అయినట్టు వైద్యులు గుర్తించి, శ్రీనివాసరావు కుటుంబ సభ్యులకు అవయవదానంపై అవగాహన కల్పించారు. వారు అంగీకరించడంతో కిడ్నీల్లో ఒకదానిని, లివర్‌ను విశాఖ తరలించగా, మరో కిడ్నీని జెమ్స్ ఆసుపత్రికి తరలించారు. అవయవదానానికి అంగీకరించిన కుటుంబ సభ్యులకు ధ్రువపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మృతదేహానికి జెమ్స్ ఆసుపత్రి వైద్యులు, విద్యార్థినులు, సిబ్బంది పూలమాలలు వేసి కన్నీటి నివాళులర్పించారు. కార్యక్రమంలో జెమ్స్ కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మీలలిత, క్రిటికల్ కేర్ స్పెషలిస్టు శివ అన్వేష్, ఆర్ఎంవోలు బాలమురళి, ప్రవీణ్, ఆపరేషన్ మేనేజర్ జ్యోత్స్న పాల్గొన్నారు.


అవయవదాత శ్రీనివాసరావు (ఫైల్)

అలరించిన అవధానం


అవధానం నిర్వహిస్తున్న దృశ్యం

ఆమదాలవలస: కచ్చపీ కళాక్షేత్రం ఆధ్వర్యంలో గురువారం ఆమదాలవలసలో ఓ కల్యాణ మండపంలో నిర్వహించిన అవధానం సాహిత్యప్రియులను అలరించింది. బ్రహ్మశ్రీ సునరాపు చంద్రశేఖర్‌శర్మ, బ్రహ్మశ్రీ రంప సాయికుమార్‌శర్మ 16 మంది పృచ్ఛకులు అడిగిన ప్రశ్నలకు చమత్కారంగా సమాధానాలు ఇచ్చారు. దత్తపది, వ్యస్తాక్షరి, సమస్య, ఘంటాగణనం వంటి తొమ్మిది అంశాలతో ద్విగళ ద్విగుణిత అవధానం రసవత్తరంగా సాగింది. సభా సంచాలకునిగా సాహిత్య రత్న బ్రహ్మశ్రీ బంకుపల్లి రమేష్‌శర్మ వ్యవహరించారు. కచ్చపీ కళాక్షేత్రం ప్రధాన కార్యదర్శి బంకుపల్లి దుర్గా శ్రీనివాసశర్మ, అధ్యక్షుడు శ్రీరామ చంద్రమూర్తి, గౌరవాధ్యక్షులు పేడాడ ప్రతాప్‌కుమార్, రొటేరియన్ వెంకుబాబు, జేజే మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలు

ఎచ్చెర్ల: జీలుగు, కట్టు జనుము, పిల్లిపెసర తదితర పచ్చిరొట్ట విత్తనాలను 50 శాతం సబ్సిడీపై రైతుభరోసా కేంద్రాల ద్వారా ఇస్తామని ఏవో వై.సురేష్ తెలిపారు. ఈ విత్తనాలు కావల్సిన రైతులు వారి వివరాలను వ్యవసా య/ఉద్యాన సహాయకులు ద్వారా నమోదు చేసుకోవాల న్నారు. 50 శాతం సబ్సిడీ మినహాయించగా 10 కిలోల జీ లుగు ప్యాకెట్, కట్టె జనుము రూ.440 వంతున, ఎనిమిది కిలోల పిల్లిపెసరకు రూ.536 రైతులు చెల్లించాలన్నారు.

వివాదాల్లోకి లాగొద్దు

శ్రీకాకుళం, మే 16(ఆంధ్రజ్యోతి): క్రియాశీలక రాజకీయాల నుంచి తప్పుకుని వ్యవసాయంలోకి వెళ్లిపోతున్నామని, అందువల్ల తమను ఎటువంటి వివాదాల్లో లాగవద్దని మాజీ మంత్రి, టీడీపీ సీనియర్ నాయకులు గుండ అప్పలసూర్యనారాయణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబుకి ఇప్పటికే ఈ విషయాన్ని స్పష్టం చేశామని.. మరొక అద్వానీగా చేస్తే పార్టీలో ఉంటామని.. కానీ క్రియాశీలక రాజకీయాల్లో ఉండమని తెలియజేసినట్టు వెల్లడించారు. శ్రీకాకుళం అసెంబ్లీ టిక్కెట్ విషయంలో తన సతీమణి గుండ లక్ష్మీదేవికి అన్యాయం జరిగిందని తాను మనస్ఫూర్తిగా నమ్ముతున్నానని చెప్పారు. అందుకే పొలిటికల్ వృత్తి నుంచి వ్యవసాయానికి వెళ్లిపోతున్నామని.. అనవసరంగా తమను వివాదాల్లోకి లాగవద్దని కోరారు. సుదీర్ఘ రాజకీయ జీవితంలో తమపై అవినీతి ఆరోపణలకు గానీ.. నేర అభియోగాలు గానీలేవని.. ఇదీ చరిత్ర అంటూ ప్రకటనలో స్పష్టం చేశారు.

నేడు బీఆర్ఏయూలో క్యాంపస్ డ్రైవ్

ఎచ్చెర్ల: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీలో దివీస్ లేబొరేటరీలో ట్రైనీ సూపర్‌వైజర్ ఉద్యోగాల కోసం ఈ నెల 17న క్యాంపస్ డ్రైవ్ నిర్వహించనున్నట్టు వర్సిటీ రిజిస్ట్రార్ పి.సుజాత తెలిపారు. బీఎస్సీ, ఎంఎస్సీ, బీటెక్ (కెమికల్), బీ ఫార్మసీ ఉత్తీర్ణులైన వారు ఈ పోస్టులకు అర్హులన్నారు. 2021-24 విద్యా సంవత్సరంలో ఆయా కోర్సులు చదివి ఫైనల్ ఇయర్ రాసిన విద్యార్థులు కూడా క్యాంపస్ డ్రైవ్‌కు అర్హులన్నారు. వర్సిటీలో క్యాంపస్ డ్రైవ్‌కు ఉదయం 9 గంటలకు నేరుగా హాజరుకావాలన్నారు. ఎంపికైనవారు హైదరాబాద్, కాకినాడ, విశాఖలో పని చేయాల్సి ఉంటుందన్నారు.

ఆదిశంకరాచార్యుల జయంతి

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని పాలకొండ రోడ్‌లో గల ఉపనిష్మందిరంలో ఆదిశంకరాచార్యుల జయంతి గురువారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఉపనిష్మందిరం సభ్యులు నిష్టల నర్సింహమూర్తి ఆదిశంకరాచార్యుల భక్తితత్త్వంపై మాట్లాడారు. ఈ కార్యక్రమాన్ని ఉపాధ్యక్షులు పి.పతంజలి శాస్త్రి జ్యోతిప్రజల్వన చేసి ప్రారంభించారు. కోదండరామాలయ ప్రాంగణంలో తిరువీధి, పూజలు, గ్రంథావిష్కరణ చేశారు. కార్యక్రమంలో ఎం.మోహనరావు, ఎస్.నారాయణమూర్తి, డీజీ పట్నాయక్, కార్యదర్శి వి.కామేశ్వరరావు, సభ్యులు పి.బాబూరావు, పి.ఈశ్వరరావు, పి.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో కాలిబాట వంతెన



నందిగాం: చిన్నతామరాపల్లి సమీపంలో గల వంశధార ప్రధాన ఎడమకాలువపై ఏర్పాటు చేసిన కాలిబాట వంతెన శిథిలావస్థకు చేరింది వంతెన నిర్మించి దశాబ్దాలు కావడంతో అడుగు భాగంతో పాటు రెయి లింగ్ కూడా దెబ్బతింది. దీంతో రాకపోకలకు ఆ ప్రాంత వాసులు భయపడుతున్నారు. ఈ వంతెనపై నుంచి కర్లపూడి, దిమ్మిడిజోల వైపు ఎక్కువగా ప్రయాణిస్తుంటారు. తక్షణమే కాలిబాట వంతెన నిర్మించాలని కోరుతున్నారు.

అవగాహనతో డెంగ్యూ నివారణ

నరసన్నపేట: అవగాహన ద్వారా డెంగ్యూ వ్యాధిని నిర్మూలన చేయవచ్చని పారా మెడికల్ అధికారి వి.సురేష్ తెలిపారు. గురువారం పట్టణంలో జాతీయ డెంగ్యూ నివారణ దినోత్స వం పు రస్కరించుకుని అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దోమలు వృద్ధి చెందకుండా నివారణ చర్యలను తీసుకోవాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పద్మనాభం, నరసన్నపేట పంచాయతీ ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.


మందస: ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

- **మందస:** ప్రజల భాగస్వామ్యంతోనే డెంగ్యూ నివారణ సాధ్యమని మందస ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి మద్దిల సంపత్‌కుమార్ తెలిపారు. మందసలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది రుక్మిణి, సోమేశ్వరరావు, నాగరాజు, ఎఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.
- **పొందూరు:** డెంగ్యూ వ్యాధి పట్ల ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని తాడివలస పీహెచ్‌సీ వైద్యులు నవీన్, రమేష్‌నాయుడు పిలుపునిచ్చారు. నేషనల్ డెంగ్యూ డే సందర్భంగా గురువారం మండల కేంద్రంలో డెంగ్యూ వ్యాధిపై అవగాహనా ర్యాలీని నిర్వహించారు. ఈ జ్వరాలు సోకితే మరణాలు సంభవించే ప్రమాదం ఉన్నందును జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు, నీటి కుంటలు, తడిచెత్త లేకుండా చూసుకోవాలని సూచించారు. డెంగ్యూ లక్షణాలు గుర్తించిన వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.


పొందూరు: ర్యాలీలో పాల్గొన్న వైద్యసిబ్బంది


నరసన్నపేట: ర్యాలీ నిర్వహిస్తున్న ఆరోగ్యశాఖ సిబ్బంది

చిరుజల్లులు.. చిత్తడిగా రహదారులు


సరుబుజ్జిలి జంక్షన్ సమీపంలో రహదారి దుస్థితి

సరుబుజ్జిలి: గత మూడు రోజులుగా అడపాదడపా కురుస్తున్న వర్షంతో రహదారులు చిత్తడిగా మారాయి. దీంతో గుంతల్లో నీరుచేరి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రెండు రోజులకే ఏదో సమయంలో చిన్నపాటి జల్లులతో సరిపెట్టిన వర్షం గురువారం వేకువజాము నుంచి రోజంతా చిరు జల్లులు కురవగా, రబీ పంటలను కాపాడుకోవడానికి రైతులు అవస్థలు పడ్డారు.

ప్రమాదకరంగా ఇన్నేసుపేట రోడ్డు


రోడ్డు మధ్యలో ప్రమాదకరంగా ఏర్పడిన గొయ్యి

ఇచ్ఛాపురం: ఇన్నేసుపేట రోడ్డు గతుకులుగా తయారై ప్రమాదకరంగా మారింది. దీంతో వాహనదారులతో పాటు పాదచారులు కూడా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆ గ్రామస్థులు వాపోతున్నారు. రోడ్డు మధ్యలో పెద్ద పెద్ద గోతులు ఏర్పడడం వల్ల గోతుల్లో ద్విచక్ర వాహనదారుల పడి గాయాలు పాలవుతున్నార న్నారు. చిన్నపాటి వర్షానికి గోతుల్లో నీరు చేరడంతో గోతులు ఎక్కడ ఉన్నాయో తెలియక ప్రమాదాలు జరుగుతున్నాయని, రాత్రిపూట తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని ఇప్పటికైనా అధికారులు స్పందించి గోతులు పూడ్చాలని కోరుతున్నారు.